# బాధ కవిత్వానికి పర్యాయపదం

చక్కని పద్యాలు రాసి నీకు వినిపించాడే చవితినాడు, ఆ కుర్రాడు చాలా బాధపడుతున్నాడని వినీ వినగానే నాకేదో వేదనా, అణుశేశం ఆవేశం ఆమట్టునే ఆగ్రహం వచ్చి, అటువంటివాళ్ల అవస్థలమీద ఖర్చు పెట్టడానికి నాదగ్గర కన్నీళ్ళు లేవన్నాను.

బాధపడడం చేతకానివాళ్లు పద్యాలు రాస్తే, బాధపడడం భరించలేనివాళ్లు పద్యాలు చదివితే, పద్యాలు అందులోకీ యతిప్రాసల్లేని అర్థంలేని పద్యాలు రాసి బాధపడడం, అర్థంలేని బాధపడడం, యతిప్రాసల్లేని బాధపడడం అన్నాన్నేను.

ఆ కుర్రాడు నాదగ్గరికి వచ్చిన మాట నిజమే. పద్యాలు చదివిన మాట నిజమే. నేనతణ్ని పొమ్మన్నమాటా నిజమే. ఎందుకు పొమ్మన్నానో చెప్పడానికే ఈ కథ.

కథా అన్నాను? సంఘటనల్లేని సంచలనంలేని కర్తకర్మక్రియల్లేని కథనాన్ని కథనడం ఎలా? ఇప్పుడే చెబుతున్నానిందులో ఒక పూరిల్లు గాని. పచ్చకర్పూరం కాని, చివరికొక సిగరెట్టు కాని తగలబెట్టినప్పుడు బయల్దేరే పొగలో కనిపించే కదలిక పాటిదికూడా ఈ రాతలో మీకు కనబడదు. మెదడు తగలబడిపోయేటప్పటి పొగ కాని, పొగ కదలనట్టు కనిపించే కదలడం, జరగనట్టు కనిపించే జరగడం ఇందులో చూపించాలని ఎందుకో ప్రయత్నం.

నీ తరువాతి తరం యువకవి నీదగ్గరికి వచ్చినప్పుడు నిర్దాక్షిణ్యంగా పొమ్మన్నావు. అతని పాటలోని బాధ నీ కళ్ళవెనక నీళ్ళలో ఈదుతోందని నీకు బాగా తెలుసు. అయినా పొమ్మన్నావు, ఉప్పెనగా ఉద్గమించబోతూన్న కన్నీళ్ళను అటకాయించి!

“అపాయానికి ఇటూ దారి” అని ఎక్కడైనా ఎవరైనా ఒక హెచ్చరికను ప్రతిష్ఠిస్తే ఎంత బాగుండును! అప్పుడు మనం అంతమందిమీ అటు వెళ్ళడం మానేద్దుము.

మానేస్తామా? ఏమో అబ్బా! నామట్టుకు నేను అపాయాలని అన్వేషించడంలోనే ఆనందం పోగుచేసుకుంటాను. ఇంకా ఎందరో ఉన్నారు ఇలాంటి నాలాంటి వాళ్లు. అపాయం స్వభావాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలంటారు వాళ్ళు. నిషేధాలు విధిస్తూ నిలబడే పోలీసుబలం నిరుపయోగం వీళ్ల విషయంలో.

అపాయం బోర్డుకట్టి అటు వెళ్ళకుండా పజల్ని శాసనాలద్వారా అరికట్టి అపాయానికి ఇవతలివేపు క్షేమాన్ని వెదజల్లడానికి ప్రభుత్వాలన్నీ కృషి చేస్తూనే ఉంటాయి. కాని ఏం లాభం? అవతల ఏముందో చూడడానికి మానవునిలో కుతూహలం ఉన్నంతకాలం బోర్డుచేసే హెచ్చరిక నిశ్శక్తం నిర్వీర్యం.

సుమతిశతకం స్తవనీయమే. సెన్సారు బోర్డు అభిలషణీయమే. శాసనసభ అవశ్యం గౌరవనీయమే. అయితేనేం? అపాయానికి గల ఆకర్షణని నేను కొనియాడడం మానలేను.

ఈ కుర్రాడున్నాడే వీడు అపాయాల స్వభావం కనిపెట్టాలనే ఉబలాటం ఉన్నవాడు. ఆ పద్యాలు చదివినప్పుడే తెలిసింది నాకా సంగతి. పద్యాలుగా అవి బాగానే ఉన్నాయికాని అవి బతకవని నాకు తెలుసు. ఎందుకో చెప్పనా?

ఒకసారి నేను చాలా ప్రమాదకరమైన పరిస్థితిలో చిక్కుకున్నాను. ఎవరిదో అరచెయ్యి, దానిమీద ఒక గుండుసూది అంటీ అంటనట్లు నిలబెట్టి

**శ్రీరంగం శ్రీనివాసరావు**

ఉంది. దానిమీద నేను ఒంటికాలిమీద నిలుచున్నాను. అంతవరకు బాగానే ఉంది. అటువంటి సర్కస్ ఫీట్లు నేను సునాయాసంగా సాగించగలను. ఇక దిగిపోదామనుకుంటూన్న సమయానికి నా నెత్తిమీద గ్రంథాలయాల దండయాత్ర ప్రారంభమైంది. ఎంత బరువుందో ఇప్పుడు జ్ఞాపకం లేదు గాని ప్రపంచ కవుల రచనల సంపూర్ణ సంపుటం నా తలమీద వచ్చివాలింది. దానిమీద నానా భాషల నిఘంటువులు. ఉగాదిసంచికలు ఒత్తుకున్నాయి. ఇంకా ఇంకా మీదిమీదికి పోనుపోను అనంతంగా అనేక గ్రంథాలు. షేక్స్పియరు సమస్త రచనల మేలు ముద్రణం వ్యాఖ్యాన గ్రంథాలతో సహా నోస్ డైవ్ చేసినప్పుడు నా మెదడులో అణువు బద్దలైనట్టయింది. ఆకాశంవేపు పెరిగిపోతూన్న గ్రంథాలభారం నన్ను క్రుంగదీస్తోంది. అంతసేపూ ఒంటికాలుతో గుండుసూదిమీద నిలబడే ఉన్నాను. గుండుసూదిని కదలకుండా నిలబెట్టగలిగినవాడి చాకచక్యానికి తీసిపోకూడదని పౌరుషానికి నిలుచున్నాను భారబాధ భరిస్తూ. కాలైనా మార్చుకోడానికి వీల్లేదు. నా నెత్తిమీద ఎన్ని పుస్తకాలున్నాయో స్పష్టంగా తెలియదు. వాతావరణంలోని వివిధ పరిమళాలను చర్మంతో పీలుస్తూ గ్రంథాల పేర్లు పోలుస్తున్నాను. మధ్యమధ్యని ఎక్కాల పుస్తకాలూ అచ్చుతప్పులతో నిండి అణాకీ అర్థణాకీ అమ్ముడుపోతున్న చవకబారు పుస్తకాలూ గుచ్చుకుంటున్నాయి. అమూల్యమైన తాటాకు గ్రంథాలతో తంజావూరు లైబ్రరీ నా నెత్తిమీద పడింది. తామ్రశాసనాలూ శిలాశాసనాలూ తగులుతున్నాయి. నా రక్తనాళంలోని నెత్తురు వాటి ఒత్తిడిని అనుభవిస్తోంది.

నామీద గ్రంథాలూ నాకింద గుండుసూదీ! ఏ తెలియరాని గణితశాస్త్ర సూత్రం వల్లనో అవి నిలబడి నన్ను నిలబెట్టాయి.

అరచెయ్యి అభయహస్తం. పడిపోతానని భయంలేదుగాని పాడడానికేమీ తోచలేదు. పాడాలనే బాధమాత్రం పొడుస్తోంది. ఏదిపాడినా ఈ పుస్తకాల సారమే. జీవితానుభవమే కావ్యవస్తువు కావాలని నా కప్పటికింకా తెలియదు.

ఈ యిరుకు పరిస్థితిలో చిక్కుకొని ఏదో పాటపాడాను. ఆ పాట చాలామందిని ఆకర్షించిందికూడా. అరచేతి కిరుపక్కలా ఉన్న అగాధమైన లోయల్లో తండోపతండాలుగా క్రిక్కిరిసిపోయిన ప్రేక్షక జనం అయిదునిమిషాల ఇరవై సెకండ్లసేపు కరతాళధ్వనులుచేసి నా పాటని అభినందించారు.

ఆ పాటకి ముగ్ధుడైపోయాడు ఈ కుర్రాడు. దానికి అందమైన అనుకరణలు తయారుచేశాడు. అదీ నాకోపం. అందుకే అతణ్ని పొమ్మన్నాను. అందుకే అతని పాటలు బతకవన్నాను.

నువ్వు స్వయంగా అపాయాల్లోకి వెళ్లు. ఎరువు తెచ్చుకున్న అభిప్రాయాల్ని తగలెట్టడానికి వీలుగా ఒక అగ్గిపెట్టె నీతో తీసుకువెళ్లడం మరిచిపోకు. గుండుసూదిమీద ఒంటికాలితో నిలబడడం గొప్పమాటే. కాని అదే అంత గొప్పా కాదు. ఇంకో కవి - ఎంత గొప్పవాడైనా - నువ్వు వాడివి కావాలని ప్రయత్నించకు. ఇన్నాళ్ళూ నువ్వు అర్థానుస్వారంలాగ ముద్రాసురుడిలాగ బతికేవు. పేపర్ వెయిట్ లాగ, రబ్బర్ స్టాంప్‌లాగ బతికేవు. వెళ్ళు జీవితంలోకి!

రెండోరకం పద్యంలోకూడా బాధ ఉంటుంది. కాని అది బతికే బాధకాదు. బతికించే బాధ కానేకాదు. ★